క్లుప్తంగా

108లో సుఖ ప్రసవం



పుట్టిన బిడ్డతో 108 సిబ్బంది

సైదాపురం : మండలంలోని మొలకలపూండ్ల గ్రామానికి చెందిన మహిళ ఆదివారం 108లో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మొలకలపూండ్ల గ్రామానికి చెందిన పి.నందినికి ఆదివారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. 108 వాహనం సిబ్బంది గ్రామానికి చేరుకుని గర్భిణి నందినిని ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించారు. ఆమెకు నొప్పులు తీవ్రం కావడంతో ఈఎంటీ ఎం.అశోక్‌కుమార్ వాహనంలోనే కాన్పు చేశారు. నందిని ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం వారిని ఆస్పత్రి తరలించారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు 108 వాహన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదానానికి రూ.50,116 విరాళం



అధికారులకు నగదు అందజేస్తున్న దాతలు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన కొణతాలపల్లి రామసుబ్బయ్య ఆదివారం రూ.50,116 విరాళం ఇచ్చారు. ఈ మేరకు నగదును ఆలయ సహాయ కమిషనర్ బీ ప్రసన్నలక్ష్మికి అందజేశారు. ఆయనకు అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం



వ్రతం నిర్వహిస్తున్న కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు తినిదులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని జీఎస్‌రాయులు కల్యాణ మండపంలో ఆదివారం కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో పలువురు దంపతులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ కార్తీక మాసంలో సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించడం శుభప్రదమన్నారు. ఈ క్రమంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించినట్టు తెలిపారు.

ఉసిరి చెట్టుకు పూజ శుభప్రదం



ధాత్రి చెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు

చిల్లకూరు : కార్తీక మాసంలో ఉసిరి(ధాత్రి) చెట్టుకు పూజలు చేయడం శుభప్రదమని కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు తెలిపారు. ఆలయంలో ఆదివారం ధాత్రి చెట్టుకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు మాట్లాడుతూ ఉసిరి చెట్టుకు కార్తీక మాసంలో పూజలు చేయడం, చెట్టు కింద భోజనం చేయడం ఎంతో శ్రేష్టమన్నారు. కార్యక్రమానికి ఉభయకర్తలుగా నెల్లూరుకు చెందిన బట్టేపాటి స్నేహలత, వరగలికి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ యరటపల్లి జానకిరామి రెడ్డి, శ్యామలమ్మ వ్యవహరించారు.

పత్రాలు లేని 25 వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని సాదుపేట సెంటర్‌లోని కాలనీల్లో ఆదివారం ఉదయం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 25 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఒకటవ పట్టణ సీఐ శేఖర్‌బాబు మాట్లాడుతూ అనుమానాస్పదంగా ఎవరైనా తిరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం కొత్తగా వచ్చిన వారి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్, ఏఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షామ హాస్టళ్లు

పేద విద్యార్థులు చదువులు కొనసాగించేందుకు ఏర్పాటు చేసిన హాస్టళ్లు వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. పలుచోట్ల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరుగుదొడ్లకు తలుపులు లేవు. కొన్ని చోట్ల గదులకు కిటికీలకు తలుపులు లేవు. చలి తీవ్రత పెరగడంతో విద్యార్థులు వణుకుతున్నారు. పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. మురుగు ముందుకు కదలక పోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు విజృంభిస్తుండడంతో రాత్రిళ్లు నిద్రించలేకపోతున్నట్టు పిల్లలు వాపోతున్నారు. కొన్ని హాస్టళ్లను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. అరకొర వసతులతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లోని హాస్టళ్లలో వసతులపై సాక్షి పరిశీలన చేపట్టింది. ఈ సందర్భంగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీనిపై ప్రత్యేక కథనం.

- శిథిలావస్థలో పలు వసతి గృహాల భవనాలు
- పలుచోట్ల అద్దె భవనాల్లో హాస్టళ్ల నిర్వహణ
- తలుపులు లేని మరుగుదొడ్లు
- కిటికీలకు తలుపులేని వైనం
- చలితోపాటు దోమలతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



దొరవారిసత్రం : బాలికల వసతి గృహంలో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్ల తలుపులు

సూళ్లూరుపేట రూరల్/ఓజిలి/దొరవారిసత్రం/పెళ్లకూరు/చిల్లకూరు/వెంకటగిరి(సైదాపురం) :

■ సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న బీసీ బాలికల వసతి గృహం శిథిలావస్తుకు చేరింది. ఇక్కడ సుమారు 150 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఒకే భవనం ఉంది. అది కూడా శిథిలావస్థకు చేరింది. కిటికీలకు తలుపులు లేవు. చలితోపాటు దోమలతో రాత్రిళ్లు ఇబ్బందులు పడుతున్నట్టు పిల్లలు పేర్కొన్నారు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి.

■ దొరవారిసత్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో 107 మంది బాలికలు ఉన్నారు. మూడు గదులు మాత్రమే ఉన్నాయి. ఉదయం, రాత్రి సమయాల్లో వరండాలో, ఆరుబయట మట్టిలోనే కూర్చొని భోజనం చేయాల్సిన దుస్థితి. 8 మరుగుదొడ్లు, 8 బాత్రూమ్‌లు ఉన్నాయి. వీటికి తలుపులు సక్రమంగా లేవు. గత ఏడాది స్వచ్ఛభారత్ కింద కేంద్రం సుమారు రూ.5 లక్షలు వెచ్చించి ఆరు మరుగుదొడ్లు, ఆరు బాత్రూమ్‌లు నిర్మించినా వినియోగంలోకి తీసుకురాలేదు. ప్రహరీ గోడ లేకపోవడంతో రాత్రిళ్లు బాలికలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

■ ఓజిలి మండలంలో అత్తివరంలో బీసీ బాలుర వసతి గృహాన్ని 20 యేళ్లుగా అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ 54 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వార్డెన్ ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి. ఒక్క మరుగుదొడ్డి మాత్రమే ఉంది. నీటి సౌకర్యం లేదు. దీనికి ప్రతి నెలా రూ.10,200 అద్దె చెల్లిస్తున్నారు. గ్రామానికి చెందిన ఒక నాయకుడు హాస్టల్‌కు సొంత భవనం మంజూరు కాకుండా అడ్డుకుంటున్నారని వినికిడి.

■ పెళ్లకూరు మండలం రోసనూరులో బీసీ హాస్టల్ ఉంది. 25 యేళ్లుగా అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నారు. రికార్డు పరంగా హాస్టల్లో మొత్తం 54 మంది విద్యార్థులు ఉన్నారు. సోమవారం 24 మంది మాత్రమే టిఫిన్‌కు హాజరయ్యారు. మిగిలిన వారంతా గ్రామానికి చెందిన స్థానిక విద్యార్థులని సమాచారం. రాత్రిళ్లు వార్డెన్ హాస్టల్‌లో ఉండకుండా నాయుడుపేటలోని తన నివాసానికి వెళుతున్నట్లు తెలిసింది.

■ గూడూరు రూరల్ పరిధిలోని చెన్నూరులో ఉన్న ఎస్టీ గురుకుల బాలుర వసతి గృహంలో స్నానపు గదులకు తలుపులు లేవు. ఒకరు కాపలా ఉండగా మరొకరు స్నానం చేయాల్సిన దుస్థితి.



ఓజిలి: అత్తివరంలో అద్దె భవనంలో నడుస్తున్న బీసీ సంక్షేమ వసతి గృహం

■ చిల్లకూరు మండలంలోని ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో సరిపడా మరుగుదొడ్లు లేవు. ప్రహరీ గోడలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. తీర ప్రాంతంలోని వరగలిలో ఉన్న బీసీ వసతి గృహంలో 50 మంది విద్యార్థులు ఉండాల్సి ఉండగా 15 మంది లోపే ఉంటున్నారు.

■ కోటలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులే పనులు చేసుకుంటున్నారు. విద్యానగర్‌లోని బీసీ బాలికల వసతి గృహం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. వసతులు లేకపోవడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే భవనం ఉరుస్తోందని వాపోతున్నారు.

■ వాకాడులోని బీసీ వసతి గృహం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. వసతులు లేవు.

■ చిట్టమూరు మండలంలో ఉన్న బీసీ వసతి గృహంలో 40 మంది విద్యార్థులకు గాను 15 మంది మాత్రమే ఉంటున్నారు. మరుగుదొడ్లకు తలుపులు లేవు.

■ సైదాపురంలోని బీసీ హాస్టల్–1ను ఇటీవల మూసేశారు. అక్కడున్న 27 మంది విద్యార్థులను బీసీ హాస్టల్–2కు బదిలీ చేశారు. కనీస వసతులు లేవు. మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి.

■ కలువాయి మండలంలోని ఎస్సీ వసతి గృహానికి ప్రహరీ గోడ కూలిపోవడంతో ముళ్ల కంచె వేశారు. బాలికల వసతి గృహం భవనం శిథిలావస్థకు చేరుకుంది.

■ రాపూరులో ఉన్న వసతి గృహాలకు ప్రహరీ గోడలు లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ కరువైంది. కనీస వసతులు కనిపించడం లేదు.

■ డక్కిలి మండలంలో ఉన్న రెండు సంక్షేమ వసతి గృహాల్లో కనీస వసతులు లేక విద్యార్థులు పడుతున్నారు. భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

■ బాలాయపల్లి మండలంలోని పిగిలాం, బాలాయపల్లిలోని మూడు వసతి గృహాల్లో సౌకర్యాలు నామమాత్రంగా ఉన్నాయి. విద్యార్థులకు అవస్థలు తప్పడంలేదు.

వసతుల కోసం నివేదిక పంపాము

డీవీ సత్రం బాలికల వసతి గృహంలో వసతుల కోసం జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపాము. ముఖ్యంగా విద్యుత్, మరుగుదొడ్లు, బాత్రూమ్‌ల తలుపుల మరమ్మతులు, ప్రహరీ గోడ ఎత్తు పెంచడం, భవనం మరమ్మతులు, విద్యార్థులు స్టడీ ప్లాట్‌ఫారం నిర్మాణం తదితరాలకు ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే పనులు చేపడతాం.

– శేషమ్మ, వార్డెన్, బాలికల వసతి గృహం, దొరవారిసత్రం

■ వెంకటగిరి పట్టణంలో ఉన్న ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాన్ని పాత భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. పైకప్పు పెచ్చులు ఊడి విద్యార్థులపై పడుతున్నాయి. కొన్ని మరుగుదొడ్లను మూసివేశారు. తలుపులు విరిగిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రాణీపేట సమీపంలో బాలుర సంక్షేమ వసతి గృహం భవనం శిథిలావస్థకు చేరుకుంది.



దొరవారిసత్రం : నీటి వసతి లేక వినియోగంలోకి రాని మరుగుదొడ్లు, బాత్రూమ్‌లు



చిట్టమూరులోని బీసీ వసతి గృహంలో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు



వెంకటగిరిలో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలి

వెంకటగిరి(సైదాపురం) : విద్యార్థులు చిన్నతనం నుంచే పుస్తక పఠనాన్ని అలవరుచుకోవాలని ఎంఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. వెంకటగిరి పట్టణం తూర్పువీధిలో ఉన్న మహాత్మాగాంధీ గ్రంథాలయంలో ఆదివారం చదవడమంటే మా కిష్టం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో దినపత్రికలు, పుస్తకాలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పలు రకాల పుస్తకాలు ఉన్నాయని తెలిపారు. రోజూ పుస్తకాలను చదవడం వల్ల విజ్ఞానం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అంజయ్య, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

పగిలిన తాగునీటి పైపులైన్



వృథాగా పోతున్న నీరు

చిల్లకూరు : గూడూరులో ఆదివారం కండలేరు నుంచి నీటిని సరఫరా చేసే పైపులైను ఆదివారం పగిలిపోయింది. దీంతో సుమారు గంట పాటు నీరు వృథాగా పోయింది. గమనించిన స్థానికులు మున్సిపల్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టారు. గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నీటి ఒత్తిడి ఎక్కువ ఉన్న సమయంలో పైపులైన్లు పగిలిపోతున్నాయని, వెంటనే మరమ్మతులు చేస్తున్నామని వెల్లడించారు.

ఎన్‌సీసీతో దేశభక్తి



ఎన్‌సీసీ డేలో పాల్గొన్న విద్యార్థులు

కోట : ఎన్‌సీసీ ద్వారా క్రమశిక్షణ, దేశభక్తి అలవడుతాయని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ జెండాను ఆవిష్కరించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విద్యార్థులు పరేడ్ నిర్వహించారు. కళాశాల ప్రాంగణంలో వంద మొక్కలు నాటారు. నావల్ యూనిట్ ఏఎన్‌వో మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు సిద్ధలయ్య కోనలో ప్రత్యేక పూజలు

సైదాపురం: సైదాపురం సమీపంలోని శ్రీసిద్ధలయ్య స్వామి కోనలో కార్తీక మాసం నాలుగో సోమవారం తిరునాళ్ల అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీదక్షిణామూర్తి ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించనున్నారు. సోమవారం రాత్రి బలిజ సంఘం ఆధ్వర్యంలో గ్రామోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

డ్రోన్‌తో మందుల పిచికారీ



వాకాడు పొలంలో డ్రోన్‌తో పురుగు మందును పిచికారీ చేస్తున్న రైతు

వాకాడు : రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్ని వర్గాల వారూ అందిపుచ్చుకుంటున్నారు. తద్వారా పనుల వేగం పెరగడంతోపాటు సమయం, డబ్బు ఆదా అవుతోంది. కష్టం కూడా తప్పుతోంది. ఆధునిక టెక్నాలజీని వ్యవసాయంలోనూ విరివిగా వినియోగిస్తున్నారు. నిన్నటి వరకు రైతు హ్యాండ్ స్ప్రేయర్, పవర్ స్ప్రేయర్లను వీపుకు తగిలించుకుని పురుగు మందులు పిచికారీ చేసేవారు. రోజంతా కష్టపడినా 7 ఎకరాల్లో మాత్రమే పిచికారీ పూర్తయ్యేది. ప్రస్తుతం మందుల పిచికారీకి డ్రోన్‌ను వినియోగిస్తున్నారు. రైతు చేను గట్టుపై కూర్చుని డ్రోన్‌ను ఆపరేట్ చేస్తూ గంటల వ్యవధిలోనే మందుల పిచికారీని పూర్తి చేస్తున్నారు. వాకాడులో ఆదివారం ఒక రైతు డ్రోన్‌తో 2 గంటల్లో 10 ఎకరాల్లో పురుగు మందును పిచికారీ చేశాడు.

నెర్రికాలువలో తగ్గని నీటి ప్రవాహ ఉద్ధృతి



మినమనముడి గ్రామ సమీపంలో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నెర్రికాలువ

దొరవారిసత్రం : ఇటీవల కురిసిన వర్షాలకు నెర్రికాలువలో ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. మినమనముడి గ్రామ సమీపంలో ఈ కాలువను దాటలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గం గుండానే మినమనముడి, చందనముడి గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రాంతంలో నెర్రికాలువపై నిర్మించిన లోలెవల్ బ్రిడ్జిపై నాలుగు అడుగుల వరకు ప్రవాహం ఉంది. ప్రజలు, వాహనాల రాకపోకలు స్తంభించడంతో ప్రజలు సూళ్లూరుపేట మండలం పిండిపాళెం మీదుగా చుట్టు తిరిగి చందనముడి, మినమనముడి గ్రామాలకు వెళ్లాల్సి వస్తోంది. వర్షాలు వచ్చి నెర్రికాలువలో నీటి ప్రవాహం పెరిగిన ప్రతిసారీ రాకపోకలకు కష్టాలు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మినమనముడి ప్రాంతంలోని నెర్రికాలువపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు.

సెలవు రోజుల్లో తరగతులు నిర్వహణపై నిరసన



నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

గూడూరు రూరల్ : కార్పొరేట్ కళాశాలలు, పాఠశాలల్లో సెలవుల్లో కూడా తరగతులు నిర్వహించడం ఎంత వరకు సబబని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ప్రశ్నించారు. పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యం ఆదివారం తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు అక్కడికి చేరుకున్నారు. యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేసారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు సెలవులు ఇవ్వకుండా మానసికంగా ఒత్తిడికి గురిచేయడం తగదన్నారు. అనంతరం విద్యార్థులను బయటకు పంపి నిరసన తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాలల యాజమాన్యాలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు శశికుమార్, సతీష్, దీపు, సుజిత్, మధు, సుమన్, చరణ్, సిరాజ్, లోకేష్, అభిరామానంద్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సరుకులు వితరణ



పేదలకు సరుకులు అందజేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు

చిల్లకూరు : గూడూరు పట్టణంలోని డీఎస్‌ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు సరుకులు అందజేశారు. రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ గుణ్ణం సేవా ట్రస్టు నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి సహకారంతో పేదలకు సరుకులు అందజేశామని తెలిపారు. ప్రతి నెలా 25 మంది పేదలకు సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. దాతలు ముందుకు వచ్చి పేదలకు అండగా నిలవాలని కోరారు. ప్రజేంద్రరెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, హరినాథ్‌రెడ్డి, క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వనభోజనాలు

కోట/నాయుడుపేట టౌన్ : కోటలోని కోటమ్మ ఆలయం, నాయుడుపేట పట్టణంలోని వళ్లి దేవసేన సమేత షణ్ముగ సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కార్తీక వనభోజన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేపట్టారు. పంచామృతాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అలాగే నాయుడుపేటలో తులసిదామోదర కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కమిషనర్ కె.చిన్నయ్య తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమస్యలపై అర్జీలు ఇచ్చేవారు వారి ఆధార్ కార్డు జిరాక్స్, అర్జీదారుడి మొబైల్ నంబర్ అందజేయాలని కోరారు.

అపాచీ కార్మికులకు సత్కారం



కార్మికులతో అపాచీ పరిశ్రమ జీఎం ప్రతినిధులు

తడ: సమైక్యాంధ్ర ఉద్యమ సమయంలో ఎన్నో ఇబ్బందులు పడి పరిశ్రమను ముందుకు నడిపించిన అపాచీ బూట్ల పరిశ్రమ కార్మికులను ఆదివారం ఘనంగా సన్మానించారు. సమైక్యాంధ్ర ఉద్యమం ముగిసి పదేళ్లు పూర్తయిన సందర్భంగా అప్పటి నుంచి ఇప్పటికీ పనిచేస్తున్న 2,300 మంది కార్మికుల గౌరవార్థం సంబరాలు నిర్వహించారు. కార్మికులు, వారి పిల్లలు ఆటపాటలతో అలరించారు. పరిశ్రమ జీఎం ముత్తు గోవిందస్వామి మాట్లాడుతూ సమైక్యాంధ్ర ఉద్యమం సమయంలో బంద్‌లు, రాస్తారోకోలతో రోడ్లు సరిగా లేవన్నారు. రాకపోకలు సరిగా లేకపోయినా అపాచీ కార్మికులు సుదూర ప్రాంతాల నుంచి నడుచుకుంటూ విధులకు హాజరయ్యారని తెలిపారు. వాళ్ల శ్రమను, అంకిత భావాన్ని గుర్తించి సముచిత రీతిలో సత్కరించాలని నిర్ణయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు గెవిన్‌చాంగ్, పీఆర్వో మోహన్ అదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్

చిల్లకూరు : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు లయన్స్ క్లబ్ తోడ్పాటు అందిస్తుందని వైజేపీ గూడూరు లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గౌతం తెలిపారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టులో శిక్షణ పొందిన మహిళలకు ఆదివారం గూడూరు పట్టణంలోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో ఆదివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ గూడూరులోని వైజేపీ లయన్స్ క్లబ్ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం క్లబ్ సభ్యుడు మురళీనాయుడు విద్యార్థులకు మెటీరియల్ అందజేశారు. వై.గురునాథం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. శ్రీనుయాదవ్ దుప్పట్లు ఇచ్చారు. అడివిలో వినాయకుడి గుడికి సుబ్రమణ్యం రిఫ్రిజిరేటర్ వితరణ చేశారు. క్లబ్ అధ్యక్షుడు చిల్లకూరు శేషమ్మ స్కూల్‌లో నిర్వహించే కుట్టు శిక్షణా కేంద్రానికి కుట్టు మిషన్ అందించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో తల్లీపిల్లలకు పౌష్టికాహారం, పిల్లలకు దుస్తులను వి.చంద్రశేఖరరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్ట్ రీజియన్ చైర్మన్ ఆర్‌వీరావు, మురళీ, శివరాం, వై వెంకటేశ్వరరావు, ఎస్ఎల్ఎన్ స్వామి, మురళీరాజు, రోజా, ఆర్ ప్రభావతి, ఉమాలక్ష్మి, జానకి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా చెస్ పోటీలు



చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

చిల్లకూరు : చెస్ క్రీడతో పిల్లల్లో మేథో శక్తిని పెంపొందించవచ్చని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రసాద్ తెలిపారు. గూడూరు పట్టణంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఆంధ్ర చెస్ అసోసియేషన్, తిరుపతి జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోటీల్లో సుమారు 200 మంది పాల్గొన్నారని తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. విజేతలకు ర్యాంకింగ్‌లు ఇస్తామని, వివరాలను తమ కళాశాల వెబ్‌సైట్‌లో సోమవారం పెడతామని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారమే యూటీఎఫ్ లక్ష్యం



కోట : విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు



వెంకటగిరి: మాట్లాడుతున్న కేఎస్‌బీ సూర్యప్రకాష్

నాయుడుపేట టౌన్/వెంకటగిరి రూరల్ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతోపాటు విద్యాభివృద్ధికి యూటీఎఫ్ కృషిచేస్తోందని ఆ సంఘం నాయకులు తెలిపారు. నాయుడుపేట పట్టణం లోతువానిగుంట కాలనీలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాల, వెంకటగిరిలోని పింజల వీరయ్య కల్యాణ మండపంలో ఆదివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు నిర్వహించారు. యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రామమూర్తి రాజు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం కుమారస్వామి అధ్యక్షత వహించారు. పూర్వపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబురెడ్డి, కుమారస్వామి, కేఎస్‌బీ సూర్యప్రకాష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ పనిచేస్తోందన్నారు. స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. విశ్రాంత ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నేతలను సత్కరించారు. నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల నూతన కమిటీలను ఎన్నుకున్నారు.

పోరాటాలతోనే గుర్తింపు

కోట : పోరాటాలు చేసి సమస్యలు పరిష్కరించినప్పుడే ఎవరికైనా గుర్తింపు లభిస్తుందని పలువురు వక్తలు తెలిపారు. కోటలోని షాదీమంజిల్‌లో ఆదివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ మండల మహా సభ నిర్వహించారు. ఇందులో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నుంచి యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యూటీఎఫ్ చేసిన పోరాటాలు, సాధించిన విజయాలను వివరించారు. అనంతరం యూటీఎఫ్‌కు సేవలందించిన రిటైర్డ్ ఉపాధ్యాయులు ఆవుల సుబ్బయ్య, భోగేశ్వరం, కోట వెంకటాచలం, జనార్దనరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రమేష్, మనోహర్, విజయభాస్కర్, నుమాయిష్ తదితరులు పాల్గొన్నారు.